# జీవిత మింతేనా ? +

రచన :
నూతినారాయణరావు, బి.ఏ.బి.ఇ

ఆ నాడాదివారం. ఆనందరావు తెల్లవారు జామున లేచి దంతధావన చేస్తుంటే అనురాధ ఆశ్చర్య పోయింది. అయినా ఉండబట్టక 'ఆదివారం పూట పెందలాడే లేచేరేమిటి'? అని ప్రశ్నించింది', ఏం చెప్పమన్నావ్? అయ్యవారి ఉద్యోగం అంటే - స్లిప్ టెస్టులు కుప్పలు కుప్పలుగ ఉన్నాయి - ఒక మూల కాంపోజిషన్లు పిలుస్తున్నాయి. అంతే కాదు. క్వార్టర్లీ పరీక్షలకు పేపరువ్రాయాలి. ట్రాన్స్‌లేషన్ పుస్తకాలు ఇంకా ఉండనే ఉన్నాయి.' అని ఏకభిగినికి పాఠం వప్పజెప్పేసేడు,' అయితే తెలియక అడుగుతాను. పాఠాలతోబాటు ఈ గుమస్తా పనికి ఏమైనా ఎక్కువ డబ్బు ఇస్తున్నారా? 'అని నిలదీసింది అనురాధ'. ఎక్కువ డబ్బు మాట దేముడెరుగు - 'అయ్యవారేం చేస్తున్నాడంటే తప్పులు చేసి దిద్దుకుంటున్నాడన్న' సామెతలాగా యీ మార్కులన్నీ ఆ పుస్తకంలోవీ ఈ కాగితంలోను, ఈ కాగితంలోవి ఇంకొక పుస్తకంలోను వేస్తూ ఉండటం, ఎక్కడో ఒక చోట ఎప్పుడూ పొరపాటు అంకెపడటం పరిపాటు. అందుచేత ఏ పుస్తకం చూచినా, కాగితం చూచినా దిద్దుబాట్లు తప్ప ఇంకేమీ కనిపించవు' అన్నాడు ముఖప్రక్షాళన పూర్తి చేసికొని లోనికి వస్తున్న ఆనందరావు.

'సరే లెండి - చంటివాడి జ్వరం తగ్గలేదు. ఈ రోజయినా మందు తీసుకొస్తారా?' అని ప్రశ్నించింది అనూరాధ కాఫీ అందిస్తూ - ' అవును అన్నట్లు చంటివాడి జ్వరం కదూ' జ్ఞాపకం తెచ్చుకొన్నాడు. 'అంతే కాదు. కాఫీ పొడి, పంచదార, బియ్యం, చింతపండు అయిపోయాయి. వాటి మాటేమిటి?' అన్నది అనూరాధ. నెలాఖరు కిరణావానికి యిప్పటికే 50 రూపాయల దాకా ఇవ్వాలి. ఎలాగ అన్న సమాస్య అమాంతం బుఱ్ఱలోకి వచ్చింది. పోనీ క్రొత్త జీతాలు, పాత బకాయిలు అందినా చాలా చిల్లర బాకీలు తేరిపోవును, ఏ నెలకా నెల సుద్ధ ముక్కలు అరిగిపోతున్నాయి కాని అనుకున్న మొత్తం చేతిలోకి రావడం లేదు. అప్పులు మాత్రం విస్తారంగా పెరిగిపోతున్నాయి. తనదగ్గిర చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్ళినవాళ్ళు చదువు సాగక వెనుకబడ్డవాళ్ళు. తనతో చదువుకొన్న వాళ్ళూ తనకన్నా మెరుగ్గా ఉన్నారు. తను మాత్రం ఎక్కడ ఉన్నావే గొంగళి అంటే వేసిన చోటే' అన్నట్లు ఎదుగు బొదుగులేకుండా సంసారం యీడ్వవలసి వస్తోంది. పెద్ద పిల్లకు పెళ్ళిచేయాలి. పోనీ చదువు చెప్పిస్తే ఏ ఉద్యోగమయినా చేసుకొని చేదోడుగా ఉంటుందంటే పెద్ద చదువులకు ఆర్థిక స్తోమత అడ్డు తగులుతోంది. పెద్దవాడు అప్పుడే 2 సార్లు మెట్టు ఎక్కలేక చతికిలబడ్డాడు. చేతికొచ్చే జీతపు రాళ్ళు జీవితావసరములు గడపడానికే ఆస్కారం ఇవ్వడం లేదు. ఇవన్నీ ఆలోచిస్తూంటే బాయిలర్ లో ఇంజన్ లాగ బుఱ్ఱ బాగా వేడెక్కి పోయింది ఆనందరావుకు. అయినా విధిలేక కషాయంలాగా ఉన్న ఆ కాఫీ కాస్త గుటకవేసి స్లిప్ టెస్టు కాగితాల కుప్పలో కూలబడ్డాడు. కాని మనస్సు మాత్రం ఈతిబాధలవైపే లాగుతోంది. ఎన్ని సంవత్సరాలుగా పని చేస్తున్నా మాటవరసకయినా అధికార్ల అనుగ్రహం లభించలేదు సరి కదా! ఆదారణ దూరం అయింది. క్రితం రోజు జరిగిన సంగతి తల్చుకొంటే తల తీసేసినట్లయిందితనకి. తన సీనియారిటీ కూడా లెక్క చెయ్యకుండా తనకన్నా ఎన్నో సంవత్సరాలు వెనుకగా వచ్చినవానిని తన కళ్ళెదుటే పూలదండ వేసి, చప్పట్లు చరచి ఉపాధ్యాయ సమితి కార్యదర్శిగా ఎన్నుకొన్నదంటే ముఖం జేవురించింది - అశక్తికాగలేక ఉన్న పెన్సిలు ముల్లు కాస్త జారిపోయింది. మరి దిద్దడం అవలేదు. కాస్సేపటికి కాస్త ఎంగిలి పడి మందు తేవడానికి అసుపత్రికి బయలుదేరాడు. తిరిగి వస్తుంటే 'జీవిత రహస్యం' రోజూ. 3 ఆటలు' అన్న గోడమీద ప్రకటన అమాంతం ఆకర్షించింది. జేబులో తడివి చూస్తే అర్ధరూపాయిబిళ్ళ బయట పడింది సరే ఫర్వాలేదు కొద్దికాలమైనా బాహ్య ప్రపంచాన్ని మరవవచ్చు అన్న సంకల్పంతో ఎలాగో ఆయుఫర్లాంగులు నడిచి ఆ సినిమాహాలు చేరుకొంటే ఇసుకవేస్తే రాలకుండా జనం ఉన్నారు. టిక్కట్లు అయిపోయేయి. బ్లాక్‌లో టిక్కట్లు అమ్మకం సాగుతోంది. నిరాశ చేసికొని తిరుగుముఖం పట్టేటప్పటికి

పాత స్నేహితుడు పాండురంగడు ప్రత్యక్షమయినాడు. పాండురంగడు కాస్త పైసా ఉన్నవాడు. ప్రస్తుతం కిరణా వ్యాపారం జోరుగా సాగిస్తున్నాడు. పిచ్చాపాటీ మాట్లాడిన తరువాత పెద్దక్లాసుకు వెళ్ళక తప్పలేదు ఆనందరావుకి. తీరా లోపలకు వెళ్తే జాగాలేక హాలువారు గేటువద్ద కుర్చీలువేసి కూర్చోమన్నారు. అట ప్రారంభమయింది లగాయితూ ఆడవాళ్ళవైపు పెద్ద యుద్ధం, టీ అమ్మకాలు, గేటు తలుపులు అడుగడుగుకి తీస్తూ ఉండటం చిరుగుల తెరపై సూర్యనారాయణమూర్తి ప్రత్యక్షమవడం దిగువ తరగతులలో బెంచీలు మోయడం జరుగుతోంది. మాట వినపడలేదు, బొమ్మ కనబడలేదు. ఇంతలో కాంపోజిషన్లు, స్లివ్ టెస్ట్లు' మమ్మల్ని మరచిపోయావా? రేపు సోమవారం సుమా అని జ్ఞాపకం చేయడం జరిగింది. 'స్వర్గానికి పోయినా సవతిపోరు తప్పదన్నట్లు' ఏమిటిది అని విసుగుకొని మనస్సు మళ్లించుకొని సినిమాపై దృష్టి సాగించేడు ఆనందరావు. ఈలోపుగా సినిమాలో ఇద్దరు ముసలివాళ్ళు చావడం జరిగింది. హాస్యగాడు కాలక్షేపం, రావడం నవ్వండి నవ్వండి అని కోతుగంతులు వెయ్యడంతో ప్రేక్షకులలో సంచలనం కలిగి ఈలలు చప్పట్లతో హాలు రేకులు ఎరిగి పోతున్నాయి. ఇదేసమయమని 'టీ' అని పెద్దకేకలు వేయడం చేస్తున్నారు అమ్మకందార్లు - మరికొంతసేపటికి కథానాయిక విరహగీతం హిందూస్థానీ పద్ధతిలో కర్ణకఠోరంగా సాగింది. సినిమాలోకూడ ఈతి బాధలు, ఏడుపు తప్పలేదనిపించింది ఆనందరావుకి. 'చంటివాడికెలా ఉందో ఏమో' అన్న ఆలోచన వచ్చింది. బలవంతాన వెనక్కునెట్టి ఎలాగో సినిమా చూడడం జరిగింది.

పొగ త్రాగరాదు ప్రభుత్వ ఉత్తర్వు' అని అట్టలు కట్టబడినా హాలంతా ఎలాగ చుట్టబెట్టేసి కండ్లమంటలు ప్రారంభమయ్యేయి. చీకటి పడేసమయానికి ఇల్లు చేరుకొనేసరికి అవధానిగారు పెనుభూతంలా కనిపించారు. ''వస్తూనే ఈ పీడ ఎక్కడ వచ్చింది' అని మనస్సులో అనుకొని విధిలేక పలకరించేడు అనందరావు. 'ఆనందరావుగారూ చూడండి ఇప్పటికి 4 మాసము లయింది-ఇవాళయినా ఇవ్వక తప్పదు. నేను ఇంటిపన్ను కట్టాలి-మీకు తెలియనిదేముంది' అని నాందీ స్తోత్రం ప్రారంభించారు అవధానిగారు. తనకున్న సాధక బాధకములు చెప్పి అప్పటికి తప్పించుకొనేసరికి 'తల ప్రాణం తోకకు' వచ్చింది ఆనందరావుకి. భోజనంచేసి కాస్సేపు విశ్రాంతి తీసికొందామనుకుంటే స్లివ్ టెస్టులు, కాంపోజిషన్లు వగైరా 'మామా ఏం జేశావు' అని పలకరించాయి. వాటితో కుస్తీ పట్టి కొంతవరకు సాధించేటప్పటికి నిద్రాదేవి అహ్వానించింది.

## టాగూర్ జీవితం

### 16 పేజీల బాలల పుస్తకం

శ్రీ రవీంద్రనాథ్ టాగూర్ శతవార్షికోత్సవాల సందర్భంలో బడికి వెళ్లే వయస్సుగల బాల బాలికలకు వుపయోగపడే విధంగా తేలిక భాషలో విశ్వకవి జీవిత చరిత్ర 16 పుటల పుస్తకంగా ప్రచురింపబడింది.

ఈ పుస్తకాన్ని సాహిత్య అకాడమీ ప్రచురించింది. ఇది ప్రసిద్ధ బాల రచయిత్రి శ్రీమతి లీలామజుందార్ బెంగాలీలో రచించిన పుస్తకానికి అనువాదం ఈ పుస్తకం మిగతా భారత భాషల్లో కూడా ప్రచురింపబడుతుంది.

పండిత డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond Jubilee
1898 1958
ఆయుర్వేదాశ్రమం(ప్రైవేట్)లిమిటెడ్,
మదరాసు-17.